పెద్దపల్లి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీతోపాటు వేదికపై కూర్చున్న విద్యుత్తు ఉద్యోగి తులసి(ఫైల్)

విద్యుత్తు ఉద్యోగిపై వేటు

- కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొన్నందుకు సస్పెన్షన్
- ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని చర్యలు
- 'నమస్తే తెలంగాణ' కథనానికి అధికారుల స్పందన

పెద్దపల్లి, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ఎన్నికల కోడ్ అమలులో ఉండగా కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో పాల్గొన్న విద్యుత్తు ఉద్యోగి తులసిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధి గోదావరిఖనిలోని బృందావన్ గార్డెన్‌లో ఐఎన్‌టీయూసీ మహాసభ, పెద్దపల్లి పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఇందులో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ, రామగుండం ఎమ్మెల్యే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజ్ ఠాకూర్ మక్కాన్‌సింగ్, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఇతర ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు. కాగా.. కరీంనగర్ ఎన్‌పీడీసీఎల్ ఎంఆర్‌టీ డివిజన్‌లో టీఆర్‌ఈ సెక్షన్‌లో వైడర్ గ్రేడ్(టెస్టర్)-2గా ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న తులసి ఈ వేదికను పంచుకొని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రచారం చేశారు. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ'లో 'కాంగ్రెస్ వేదికపై విద్యుత్తు ఉద్యోగి' శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. ఈ కథనాన్ని సుమోటోగా స్వీకరించిన విద్యుత్తు శాఖ ఉన్నతాధికారులు ఉద్యోగి తులసిపై చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు కరీంనగర్ ఎంఆర్‌టీ డీఈ కాళీదాస్ తులసిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల నియామవళిని ఉల్లంఘించిన కారణంగానే ప్రాథమిక చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్టుగా పేర్కొన్నారు.

- వేసవి తాపం.. కరెంటు కోతల శాపం

ఓవైపు భానుడు సెగలు కక్కుతుంటే.. వేసవి తాపంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మరోవైపు కరెంటు కోతల కారణంగా చీకట్లలోనే కాలం గడుపుతున్నారు. భైంసా పట్టణంతోపాటు గ్రామాల్లో గాలిదుమారానికి చెట్టు ఊగినా.. చిన్నపాటి చినుకు పడినా గంటల తరబడి విద్యుత్తు సరఫరా నిలిచిపోతున్నది. శనివారం సాయంత్రం కురిసిన చిన్నపాటి గాలివానకు మండల వ్యాప్తంగా రాత్రంతా విద్యుత్తు సరఫరా నిలిపేశారు. సోమవారం నిలిచిపోయిన విద్యుత్తు సరఫరా మంగళవారం సాయంత్రం వరకూ పత్తాలేదు. ఇంకా కొన్ని గ్రామాల్లో పునరుద్ధరణ పనులు బుధవారం కూడా కొనసాగేలా ఉన్నాయి. వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు అధికారులను వేడుకుంటున్నారు. -భైంసా టౌన్

రుణమాఫీ చేస్తాం.. బీఆర్ఎస్‌ను రద్దు చేస్తారా?

- మాజీ మంత్రి హరీశ్‌కు రేవంత్ సవాల్
- పంద్రాగస్టు లోపు రుణమాఫీ
- రాబోయే పంటకు రూ.500 బోనస్
- జోగుళాంబ సాక్షిగా మాట ఇస్తున్నా
- నాగర్‌కర్నూల్‌లో సీఎం రేవంత్

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/కోస్గి ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : రైతులకు పంద్రాగస్టులోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని, వచ్చే సీజన్‌లో క్వింటాల్ ధాన్యానికి రూ.500 అదనంగా బోనస్ ఇచ్చి కొనుగోళ్లు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, మల్లు రవికి మద్దతుగా ఆయన మంగళవారం జనజాతర సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు రుణమాఫీ చేయకుంటే రేవంత్ సీఎం పదవికి రాజీనామా చేస్తడా అని హరీశ్‌రావు సవాల్ చేశారని గుర్తుచేశారు. 'నేను మామా అల్లుళ్లు హరీశ్‌రావు, కేసీఆర్‌లకు సవాల్ విసురుతున్నా.. పంద్రాగస్టులోపు ఆరు నూరైనా, జోగుళాంబ సాక్షిగా మాట ఇస్తున్నా.. రెండు లక్షల రుణమాఫీ చేసి తీరుతా. ఆనాడు నువ్వు, నీ మామ బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? నా రాజీనామా కాదు, మీ పార్టీని రద్దు చేసుకోవడానికి సిద్ధంగా ఉండండి' అని వ్యాఖ్యానించారు. రైతులు ఆశీర్వదిస్తేనే కాంగ్రెస్, ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, రైతుల రుణం తీర్చుకోకుంటే తన జీవితమే వేస్ట్ అని అన్నారు. రాబోయే పంటకు 500 రూపాయల బోనస్ ఇస్తాం. అని చెప్పారు. వరి వేసుకుంటే ఉరే అని చెప్పిన కేసీఆర్ తాను మాత్రం ఫాంహౌస్‌లో వరి వేసుకున్నాడని ఆరోపించారు.

మోదీ చేతిలో కత్తి.. అరుణ

బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ప్రధాని మోదీ చేతిలో కత్తిలా మారి పాలమూరు బిడ్డనైన తనను పొడుస్తున్నారని రేవంత్ ధ్వజమెత్తారు. పాలమూరు అభివృద్ధిని ఆమె అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో గద్వాల్‌లో డిపాజిట్ గల్లంతైన బీజేపీ తమకు పోటీయే కాదని చెప్పారు. రాష్ట్రానికి, దేశానికి ఆదర్శంగా నిలిచిన బూర్గుల రామకృష్ణారావు, మల్లు అనంతరాములు, మహేంద్రనాథ్, జైపాల్‌రెడ్డి వంటి నేతలు పాలమూరు బిడ్డలన్నారు. పాలమూరు బిడ్డగా తనకు ముఖ్యమంత్రిగా అవకాశం వచ్చిందని చెప్పారు. జిల్లాలోని నాయకులు పగోడి చేతిలో చురకత్తులై లేకలేక 70 ఏండ్లకు ఒక్క అవకాశం వస్తే శత్రువులకు సహకరించేలా, దొంగలకు సద్ది మూటలు కట్టేలా తనకు వ్యతిరేకంగా తయారయ్యారని విమర్శించారు. పాలమూరులో వలసలు ఆగలేదు, కరువు పోలేదు, నీళ్లు పారలేదు, కల్వకుర్తి అట్లనే ఉంది, ఆర్డీఎస్ ఆగమైంది అని పేర్కొన్నారు. మళ్లీ ఇలాంటి అవకాశం వస్తదోరాదో, రెండు టీఎంసీలతో పాలమూరు పూర్తి చేసి, జిల్లాకు నీళ్లు ఇచ్చే బాధ్యత ప్రభుత్వానిదని చెప్పారు.

'లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి'

ఏసీబీ డీజీ సీవీ ఆనంద్

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వాధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే.. వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీజీ సీవీ ఆనంద్ కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఏసీబీ కేంద్ర కార్యాలయంలో ఏసీబీ డైరెక్టర్ వీఆర్ శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి 'లంచం ఇవ్వకండి.. మాకు సమాచారం ఇవ్వండి' అనే పోస్టర్‌ను సీవీ ఆనంద్ ఆవిష్కరించారు. ఇందుకు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఏ సమయంలోనైనా కాల్, dg_acb@telangana.gov.inకి మెయిల్ చేయాలని సూచించారు.

కవిత బెయిల్ పిటిషన్‌పై నేడు విచారణ కొనసాగింపు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ):ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్‌పై బుధవారం కూడా విచారణ జరగనున్నది. జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న కవిత తనకు బెయిల్ ఇవ్వాలంటూ సీబీఐ ప్రత్యేక కోర్టును కోరిన విషయం తెల్సిందే. కవిత పిటిషన్‌పై విచారణ మంగళవారం కొనసాగింది. కవిత తరపు న్యాయవాది రాణా వాదనలు వినిపించారు. కస్టడీని పొడిగించాలని ఈడీ తరపు న్యాయవాది కోరారు. ఈడీ అభ్యర్థన మేరకు మే 7వ తేదీ వరకు కవిత కస్టడీని పొడిగించారు. కవిత కస్టడీ పొడిగింపుపై సీబీఐ, ఈడీలు న్యాయస్థానంలో అప్లికేషన్ దాఖలు చేశాయి. కేసు దర్యాప్తు పురోగతి వివరాలను కోర్టుకు అందజేశారు. 60 రోజుల్లో కవిత అరెస్టుపై చార్జిషీటు సమర్పిస్తామని ఈడీ తెలిపింది. విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. బుధవారం మధ్యాహ్నం రెండుగంటలకు వాదనలు వింటామని చెప్పింది.

అప్పులు తీర్చేమార్గం లేక..

- దంపతుల ఆత్మహత్యాయత్నం
- భార్య క్షేమం.. భర్త మృతి
- పెద్దపల్లి జిల్లా పారుపల్లిలో విషాదం

మధుసూదన్ (ఫైల్)

ముత్తారం, ఏప్రిల్ 23: చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్తాపం చెందిన దంపతులు బలవన్మరణానికి యత్నించారు. ఈ ఘటనలో.. భార్య ప్రాణాపాయం నుంచి బయటపడగా.. భర్త మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన మంగళవారం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం పారుపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. పారుపల్లికి చెందిన పూసల సంధ్య-మధుసూదన్(43) దంపతులు. వారికి ఉన్న నాలుగెకరాల్లో వ్యవసాయం చేసేవారు. వ్యవసాయ భూమి వద్ద నీటి కొరత ఉండటంతో నెల క్రితం రూ.2 లక్షల అప్పు చేసి బోరు వేశారు. ఇతర వ్యవసాయ పెట్టుబడుల కోసం రూ.5 లక్షల వరకు అప్పు అయ్యింది. 2022లో కూతురు పెండ్లి కోసం మరో రూ.5 లక్షలు అప్పు తెచ్చారు. మొత్తం రూ.12 లక్షల అప్పు అయ్యింది. దీంతో చేసిన అప్పు తీర్చేమార్గం లేక ఆ నెల 12న పురుగుల మందు తాగారు. స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ దవాఖానకు తరలించారు. సంధ్య కోలుకొని ఇంటికి రాగా.. మధుసూదన్ అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మధుసూదన్ కుమారుడు ఆకాశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ముత్తారం ఎస్సై మధుసూదన్‌రావు తెలిపారు.

ప్రవేశ పరీక్షలకు వేళాయే

- మే 6న ఈసెట్, 7 నుంచి ఎప్‌సెట్
- ఈ ఏడాది ఎప్‌సెట్‌కు భారీగా దరఖాస్తులు

హైదరాబాద్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : 2024 -25 విద్యాసంవత్సరంలో పలు ప్రవేశ పరీక్షలకు వేళయింది. మే, జూన్ మాసాల్లో ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు. మే 6 టీఎస్ ఈసెట్‌తో ప్రారంభమై... జూన్ 6 నుంచి 9 వరకు నిర్వహించే పీజీఈసెట్‌తో పరీక్షలు ముగుస్తాయి. కీలకమైన ఎప్‌సెట్ ఎగ్జామ్ మే 7 నుంచి 11 వరకు జరుగనున్నది. ఇంజినీరింగ్ మొదలుకొని.. బీఈడీ, లా, ఎంబీఏ, ఎంసీఏ సహా అన్ని రకాల కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెలల్లోనే పరీక్షలు జరుగుతాయి. పరీక్షలను సజావుగా నిర్వహించి, ఆ తర్వాత ఫలితాలు ప్రకటించి జూన్, జూలై మాసాల్లో సీట్ల భర్తీ ప్రక్రియ చేపడుతారు. ఈ ఏడాది ఎప్‌సెట్‌కు భారీగా దరఖాస్తులొచ్చాయి. ప్రత్యేకించి ఇంజినీరింగ్ విభాగానికి 50 వేలకు పైగా దరఖాస్తులొచ్చాయి. నిరుడు ఇంజినీరింగ్‌కు 2.05,351 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 2,54,051 దరఖాస్తులు నమోదయ్యాయి. ఇక ఫార్మసీ విభాగానికి నిరుడు 1,15,332 దరఖాస్తులు రాగా, ఇప్పటివరకు 99, 831 దరఖాస్తులొచ్చాయి.

సకాలంలో తరగతులు

గతంలోనే ప్రవేశ పరీక్షల నోటిఫికేషన్లు విడుదలకాగా, దరఖాస్తుల స్వీకరణ ముగింపు దశకు చేరింది. పరీక్షలకు వారం, పది రోజుల ముందు నుంచి హాల్‌టికెట్లు జారీచేసి, షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. కరోనాతో గతంలో ప్రవేశ పరీక్షలు ఆలస్యంగా జరుగగా, సీట్ల భర్తీ ఆలస్యమయింది. దీని ప్రభావం సెమిస్టర్ పరీక్షలపై పడి విద్యాసంవత్సరాన్ని పొడిగించాల్సిన పరిస్థితులొచ్చాయి. కానిప్పుడు ముందుగానే షెడ్యూళ్లను ప్రకటించడంతో ఈ ఏడాది తరగతులు సకాలంలో ప్రారంభయ్యే అవకాశాలున్నాయి. అంతేకాకుండా కోర్సులు పూర్తిచేసిన వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్‌కు అనువైన సమయంలోనే సర్టిఫికెట్లు చేతికందనున్నాయి.

వివిధ ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు..

ప్రవేశ పరీక్ష	దరఖాస్తులు	తుది గడువు	పరీక్షాతేదీలు
టీఎస్ ఈసెట్	24,116	28-4-24	మే 6
ఎప్‌సెట్ (బైపీసీ)	99,831	1-5-24	మే 7,8
(ఎంపీసీ)	2,54,051	1-5-24	మే 9,10,11
ఎడ్‌సెట్	17,666	13-5-24	మే 23
ఐసెట్	41,801	27-5-24	జూన్ 5,6
లాసెట్	38,161	25-05-24	జూన్ 3
పీజీఈసెట్	7,141	25-5-24	జూన్ 6 నుంచి 9

వ్యవసాయ రోబోలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): సాగు ఖర్చులు పెరుగుతుండటం, వ్యవసాయ కూలీల సంఖ్య తగ్గిపోతుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యలకు తెర దించేందుకు ఇక్రిశాట్ ఇంక్యుబేషన్ సెంటర్‌లోని ఎక్స్ మెషీన్ స్టార్టప్ నడుం బిగించింది. వ్యవసాయ ఉపకరణాలను తయారు చేయడంలో జాతీయ స్థాయి గుర్తింపు పొందిన ఈ సంస్థ.. పొలాల్లో పనులు చేయగలిగే ఎక్స్100, ఎక్స్100 మ్యాక్స్, ఎక్స్ 100 అల్ట్రా పేరుతో మూడు రకాల రోబోలను అందుబాటులోకి తెచ్చింది. అర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీతో పనిచేసే ఈ రోబోలు పొలాల్లో విత్తనాలు నాటడం మొదలుకొని పంట నూర్చిడి దాకా సేవలందించగలవు. వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుకు అవసరమైన పనులను చేయగలిగేలా రూపొందించిన ఈ రోబోలను ఇటీవల షార్క్ ట్యాంక్ వేదికపై ప్రదర్శించినట్టు ఇక్రిశాట్ వర్గాలు తెలిపాయి.

చిత్రం

కృష్ణ జయంతి రోజున అనౌన్స్‌మెంట్?

సినిమా తీయడంలోనే కాదు, దాన్ని ప్రమోట్ చెయ్యడంలో కూడా దర్శకుడు రాజమౌళిది భిన్నమైన శైలి. తన సినిమా అనౌన్స్‌మెంట్ వేడుకను కూడా అట్టహాసంగా నిర్వహిస్తారాయన. కొన్ని సినిమాల విషయంలో మీడియాకు ఏకంగా కథకూడా లీక్ చేసేసిన సందర్భాలున్నాయి. చెప్పి కొట్టడం ఆయన స్టైల్. ప్రస్తుతం మహేశ్‌తో ఆయన చేయనున్న సినిమాకు చెందిన ప్రకటన కోసం సినీ ప్రేమికులందరూ ఎదురుచూస్తున్నారంటే కారణం అదే. ప్రతిష్టాత్మకమైన వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ మూవీగా తెరకెక్కనున్న ఈ సినిమా కోసం మహేశ్ ఇప్పటికే మేకోవర్ అయ్యే పనిలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్ అల్యూమినియం ఫ్యాక్టరీలో వేగంగా ఈ సినిమా ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇక ఈ సినిమా అనౌన్స్‌మెంట్ వేడుకను మే 31న, సూపర్‌స్టార్ కృష్ణ జయంతి రోజున ఘనంగా నిర్వహించడానికి నిర్మాత కేఎల్ నారాయణ సన్నాహాలు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా జక్కన్న టీమ్ సిద్ధం చేస్తున్నారని తెలిసింది. ఎం.ఎం.కీరవాణి ఈ చిత్రానికి స్వరాలను సమకూరుస్తున్న విషయం తెలిసిందే. మిగతా నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు తెలియాల్సివుంది.

ఎన్టీఆర్‌తో ఆటపాట

గత కొంతకాలంగా పూజాహెగ్డేకు అదృష్టం కలిసి రావట్లేదు. ఇటు తెలుగులో అటు బాలీవుడ్‌లో సైతం ఈ భామ చేసిన సినిమాలు ఆశించిన విజయాల్ని సాధించలేకపోయాయి. దాంతో ప్రస్తుతం ఈ అమ్మడు సినిమాలకు కాస్త విరామాన్ని ప్రకటించింది. కొంత టైమ్ తీసుకున్నా పర్లేదు కానీ మంచి కథాంశాలను ఎంచుకోవాలనే ఆలోచనలో ఉందట ఈ మంగళూరు సోయగం. తాజా సమాచారం ప్రకారం ఎన్టీఆర్ 'దేవర' చిత్రంలో పూజాహెగ్డే ప్రత్యేక గీతంలో నర్తించనున్నట్లు తెలిసింది. ద్వితీయార్ధంలో వచ్చే ఈ ఐటెంసాంగ్‌ను భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారట దర్శకుడు కొరటాల శివ. మాస్ మెచ్చేలా సంగీత దర్శకుడు అనిరుధ్ ఈ పాట కోసం మాస్ బీట్‌తో మంచి ట్యూన్‌ను సిద్ధం చేశారని అంటున్నారు. ఐటెంసాంగ్ కోసం పలువురు నాయికల పేర్లను పరిశీలించిన దర్శకుడు కొరటాల శివ, చివరకు పూజా హెగ్డేను ఖరారు చేశారని అంటున్నారు. ప్రస్తుతం 'దేవర' చిత్రీకరణ దశలో ఉంది. దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదలకానుంది.

సందీప్‌కిషన్ సినిమా మొదలైంది

'ఊరుపేరు భైరవకోన' చిత్రంతో హిట్ ట్రాక్ ఎక్కేశాడు యువహీరో సందీప్‌కిషన్. ఈ నేపథ్యంలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ పతాకాలపై రాజేష్ దండా ఆయనతో ఓ చిత్రం నిర్మిస్తున్నారు. హిట్ చిత్రాల దర్శకుడు త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం మంగళవారం హైదరాబాద్‌లో మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ నిర్మాత విజయ్ కనకమేడల కెమెరా స్విచాన్ చేయగా, అగ్ర నిర్మాత దిల్ రాజు క్లాప్ ఇచ్చారు. మరో ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. తదనంతరం చిత్ర యూనిట్‌కు వారందరూ శుభాకాంక్షలు అందించారు. తమ సంస్థలో నిర్మించిన సామజవరగమన, ఊరుపేరు భైరవకోన చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయని, ఈ సినిమాతో హ్యాట్రిక్ కొట్టబోతున్నామని నిర్మాత రాజేశ్ దండా నమ్మకం వెలిబుచ్చారు. సందీప్‌కిషన్ 30వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు రచన: ప్రసన్నకుమార్ బెజవాడ, కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: లియోన్ జేమ్స్, ఆర్ట్స్: బ్రహ్మకడలి.

మే 4న దర్శకుల పండుగ..

ప్రభాస్ 35 లక్షల విరాళం

అగ్ర నటుడు ప్రభాస్ అవసరమైనప్పుడల్లా తన పెద్ద మనసును చాటుకుంటూనే ఉన్నారు. పెదనాన్న కృష్ణంరాజు మాదిరిగానే, ప్రభాస్ చేయి కూడా పెద్దదని పరిశ్రమలో టాక్ కూడా ఉంది. రీసెంట్‌గా మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు ప్రభాస్. మే 4న విఖ్యాత దర్శకుడు స్వర్గీయ దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ 'డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్' జరుపనుంది. ఈ సందర్భంగా అసోసియేషన్‌కు ప్రభాస్ 35 లక్షల రూపాయలు విరాళంగా ప్రకటించారు. సోమవారం జరిగిన తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన 'డైరెక్టర్స్ డే ఈవెంట్' కర్టన్‌రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న దర్శకుడు మారుతి ఈ విషయాన్ని సంఘ సభ్యులకు వెల్లడించారు. సంఘ సభ్యులు హర్షం వెలిబుచ్చుతూ, దర్శకుల సంఘం సంక్షేమ నిధి కోసం ఆ డబ్బును వెచ్చించనున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంలోనే 'డైరెక్టర్స్ డే సెలబ్రేషన్స్' ఈవెంట్ వివరాలను సంఘం సభ్యులు వివరించారు. ప్రతిభా పురస్కారాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఈ వేడుక వైభవంగా జరుగుతుందని, మదర్స్‌డే, ఫాదర్స్‌డే ఉన్నట్లే డైరెక్టర్స్ డే కూడా చిరస్థాయిగా నిలవాలనేది తమ ఆకాంక్ష అని, ఇప్పటివరకూ చిన్నగా జరిగిన ఈ కార్యక్రమం ఈసారి ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరుగనుందని దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సాయిరాజేశ్, రేలంగి నరసింహారావు, వి.విజయేంద్రప్రసాద్, రాంప్రసాద్, వీఎన్ ఆదిత్య, సముద్ర, ఎన్.శంకర్, హరీశ్‌శంకర్, మారుతి, వశిష్ఠ, అనుదీప్ కేవీ తదితరులు మాట్లాడారు. తదనంతరం తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ వెబ్‌సైట్‌ను విజయేంద్రప్రసాద్, హరీశ్‌శంకర్ లాంచ్ చేయగా, 'డైరెక్టర్స్ డే' లోగోను రేలంగి నరసింహారావు ఆవిష్కరించారు.

పడమటి కొండల్లో ప్రేమకథ

అనురోప్ కటారి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పడమటి కొండల్లో'. ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యువ హీరో సాయిదుర్గతేజ్ సోషల్‌మీడియా వేదికగా ఆవిష్కరించారు. ఈ చిత్రానికి నరేశ్ పెంట దర్శకుడు. జయకృష్ణ దురుగడ్డ నిర్మాత. చిత్ర దర్శకుడు మాట్లాడుతూ 'సరికొత్త అనుభూతిని ప్రేక్షకులకు పంచే సినిమా ఇది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రంలో గొప్ప ప్రేమకథ కూడా ఉంటుంది. ఆడియన్స్‌కి ఈ సినిమా ఓ విజువల్ ఫీస్ట్. ఈ సినిమాకు చెందిన మరిన్ని విషయాలు త్వరలో ప్రకటిస్తాం' అని తెలిపారు. యశస్వి శ్రీనివాస్, శ్రావ్య రెడ్డి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కన్నన్ మునిసామి, మాటలు: ఆర్.రాము, దర్శకత్వం, సంగీతం: నరేశ్ పెంట.

మహిళా సమస్యలపై పోరాటం

సుమన్‌తేజ్, గరిమ చౌహాన్ జంటగా నటిస్తున్న చిత్రం 'సీతా కల్యాణ వైభోగమే'. సతీష్ పరమవేద దర్శకత్వంలో యుగంధర్ నిర్మిస్తున్నారు. ఈ నెల 26న ప్రేక్షకుల ముందుకురానుంది. సోమవారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఆడపిల్ల ఉండే ప్రతీ కుటుంబానికి ఈ సినిమా నచ్చుతుంది. చక్కటి ప్రేమకథతో పాటు నేటి సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చూపించాం. భావోద్వేగభరితంగా సాగుతూ ప్రేక్షకులకు మంచి సందేశాన్నందిస్తుంది' అన్నారు. కథానుగుణంగా మంచి పాటలు కుదిరాయని, యువతరంలో పాటు కుటుంబ ప్రేక్షకులకు కూడా నచ్చే అన్ని అంశాలుంటాయని నిర్మాత తెలిపారు. పాటలు మెలోడీ ప్రధానంగా అందరికీ నచ్చుతాయని సంగీత దర్శకుడు చరణ్ అర్జున్ అన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, నిర్మాత విజయ్ కనకమేడల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.